క్లుప్తంగా

పంచాయతీ ఎన్నికలకు కసరత్తు

కేటీదొడ్డి: పంచాయతీ ఎన్నికలకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. జనవరి లేదా ఫిబ్రవరిలో నిర్వహించనున్న ఎన్నికలకు సన్నద్ధమవుతున్నారు. 2006, 2010, 2014, 2019 ఎన్నికల్లో ఎవ్వరు ఎక్కడ పోటీ చేశారు.. వారి కులాలు.. వార్డు స్థానాల వారీగా వివరాలను పంచాయతీ కార్యదర్శులతో సేకరిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న గ్రామ పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియనుంది. కాగా.. ఓటర్ల తుది జాబితా విడుదల తర్వాత సర్పంచులు, వార్డు సభ్యులు రిజర్వేషన్లు ఖరారు చేయనున్నారు. దీంతో రాజకీయ పార్టీలు సర్పంచులు ఉపసర్పంచులు, వార్డు సభ్యుల పదవులకు పోటీ చేసే ఔత్సాహికులు రిజర్వేషన్లపై దృష్టి సారిస్తున్నారు.

ట్రీగార్డులు ఏర్పాటు చేయాలి

మల్దకల్: హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలకు తప్పనిసరిగా ట్రీగార్డులు ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని సద్దలోనిపల్లి, మల్దకల్, బిజ్వారం గ్రామాల్లో హరితహారం మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలకు క్రమం తప్పకుండా నీరందించి సంరక్షించాలని సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎప్పటికప్పుడు తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, రోడ్లపై మురుగు నిలువకుండా చూడాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలి

గద్వాల అర్బన్: నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను తొలగించాలని బహుజన సేన జిల్లా అధ్యక్షుడు దానయ్య శుక్రవారం ప్రకటనలో డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంతో టీఎస్‌పీఎస్సీ చైర్మన్ కుమ్మక్కై నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు. ప్రభుత్వం సమగ్ర విచారణ నిర్వహించి, చర్యలు తీసుకోవాలని కోరారు.

నత్తనడకన డ్రెయినేజీ పనులు

అయిజ: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి తూంకుంట రోడ్డు వరకు చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇటీవల రూ.10లక్షలతో డ్రెయినేజీ పనులు చేపట్టారు. అయితే తెలుగుపేట వరకు డ్రెయినేజీ నిర్మించాల్సి ఉండగా.. నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. దీంతో మురుగు నిల్వలతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల వృద్ధితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రెయినేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ

అలంపూర్: అలంపూర్ చౌరస్తా సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో గుర్తుతెలియని దుండగులు ఆయిల్ చోరీ చేశారు. ఎస్‌ఐ బాలరాజు వివరాల మేరకు.. అలంపూర్ చౌరస్తాకు వచ్చే సర్వీస్ రోడ్డులో శ్రీనివాస్‌రెడ్డి హార్డ్‌వేర్ దుకాణం వద్దనున్న ట్రాన్స్‌ఫార్మర్‌కు గురువారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ సరఫరాను నిలిపివేసి దాదాపు 100 లీటర్ల ఆయిల్‌ను చోరీ చేశారు. ఆయిల్ విలువ సుమారు రూ.4వేలు ఉంటుందని, శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని బొంకూరుకు చెందిన భార్యాభర్తలను బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. గ్రామానికి చెందిన కుర్వ మంజుల, సుధాకర్‌లు శుక్రవారం తమ పిల్లలను పాఠశాలకు పంపించేందుకు వెళ్తుండగా.. పక్కింట్లో ఉండే వడ్డె రమేష్, ప్రతాప్, హనుమంతులు అకారణంగా దూషించడంతో పాటు చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

- అంత్యక్రియలు నిర్వహించిన అయ్యప్ప స్వాములు



ఉండవెల్లి: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయం వద్ద ఓ ఆవు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. విషయం తెలుసుకున్న అయ్యప్ప స్వాములు అక్కడికి చేరుకొని గోమాతకు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో స్వామి దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం



రాయచూర్ రోడ్డును ఇరువైపులా కమ్మేసిన ముళ్లపొదలు

- అలంపూర్- రాయచూర్ రహదారి గుంతలమయం
- రోడ్డును ముళ్లపొదలు కమ్మేయడంతో పొంచి ఉన్న ముప్పు
- సూచిక బోర్డులు లేక కల్వర్టుల వద్ద తరచూ ప్రమాదాలు
- వాగులు, కల్వర్టుల వద్ద మోకాల్లోతు గుంతలు

శాంతినగర్: అలంపూర్ చౌరస్తా నుంచి బలిగేర వరకు వున్న రెండు లేన్ల ప్రధాన రహదారి ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారింది. రహదారి గుండా మూడు రాష్ట్రాలకు వెళ్లే ప్రయాణికులతోపాటు వాహనాల రద్దీ. వేగంగా వెళ్లే వాహనాలు, రోడ్డు సౌకర్యంగా లేకపోవడంతో తరచూ వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ ప్రమాదాల్లో కొందరు మృత్యువాత పడుతుండగా.. మరికొందరు కాళ్లు చేతులు విరిగి దివ్యాంగులుగా మిగిలిపోతున్నారు. అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్ చౌరస్తా నుండి అయిజ వరకు 42కిలోమీటర్ల ఆర్‌అండ్‌బీ డబుల్ రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం వందలాది వాహనాల్లో వేలాదిగా ప్రయాణికులు ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుంటారు. అంతేగాక కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలకు అనుసంధానంగా వున్న రోడ్డు కావడంతో భారీ వాహనాలు సైతం రహదారిపై వెళ్తుంటాయి. వాహనాల రద్దీకి అనుగుణంగా రోడ్డు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

కల్వర్టుల విస్తరణ పట్టదా..?

అలంపూర్ చౌరస్తా నుండి అయిజ వరకు వున్న రహదారిలో శాంతినగర్-వెంకటాపురం మధ్య వున్న కల్వర్టులు ఇరుకుగా వుంటూ ప్రమాదాలకు అడ్డాలుగా మారుతున్నాయి. గతంలో వున్న సింగిల్ రోడ్డుకు అనుగుణంగా నిర్మించిన కల్వర్టుల స్థానంలో డబుల్ లేన్‌కు అనుగుణంగా కొత్తగా కల్వర్టులు నిర్మించలేదు. దీంతో రోడ్డు సగం వరకు ముళ్లపొదలు కమ్మేసి కల్వర్టులు అగుపించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ముళ్లపొదలతో ముప్పు

42 కిలోమీటర్ల మేర వున్న రహదారిని ముళ్లపొదలు కమ్మేశాయి. దీంతో వాహనాలు ఎదురుగా వచ్చే సమయంలో అగుపించక ప్రమాదాలకు గురవుతున్నారు. వంద అడుగుల మేర వున్న రహదారి 80 అడుగుల మేర ముళ్లపొదలు, పిచ్చిగడ్డి రావడం ప్రమాదకరంగా మారింది.

పత్తాలేని సూచికబోర్డులు

కల్వర్టుల వద్ద రోడ్డును ముళ్ల పొదలు కమ్మేయడం, సూచికబోర్డులు ఏర్పాటుచేయకపోడం ప్రమాదకరంగా మారింది. వాహనాలు ఎదురుగా వచ్చిన సమయంలో రోడ్డు చివరికి వెళ్లడం కల్వర్టు గోడలను ఢీకొట్టడంతో ప్రమాదాలు చేటుచేసుకుంటున్నాయి. శాంతినగర్ నుండి వెంకటాపురం మధ్యలో వాగులపై సింగిల్ రోడ్డు వున్న సమయంలో నిర్మించిన పాత కల్వర్టులు శిథిలావస్థకు చేరడమేగాక ఇరుకుగా వున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ఇటీవల ఇద్దరు యువకులు, ఓ కర్ణాటక వాసి మృత్యువాత పడ్డారు.

రాత్రి వేళల్లో ప్రమాదకరం



ముళ్లపొదలు మూసుకుపోవడంతో ఎదురుగా వచ్చే భారీ వాహనాల వెలుతురుకు కల్వర్టులు అగుపించక తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. మోటార్‌సైకిళ్లపై వస్తున్న సమయంలో భారీ వాహనాల వెలుతురుకు ఇరుకుగా వున్న కల్వర్టులు అగుపించక ఇటీవల ముగ్గురు ప్రయాణికులు చనిపోయారు. కల్వర్టుల వద్ద సూచిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటుచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

– జమ్మన్న, యాపదిన్నె, అయిజ మండలం

ముళ్లకంపలు తొలగించాలి



శాంతినగర్ నుండి వెంకటాపురం స్టేజీ వరకు వున్న డబుల్ రోడ్డును ముళ్లపొదలు మూసుకుపోయాయి. రోడ్డుపైకి కంపచెట్లు రావడం, వాహనాలు ఓవర్‌టేక్ చేసే సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే ముళ్ల కంపలు తొలగించి ప్రమాదాల బారిన పడకుండా చూడాలి.

– కాలప్ప, యాపదిన్నె, మండలం

నిధులు మంజూరైన వెంటనే చర్యలు

రాయచూర్ ప్రధాన రహదారిపై గుంతలవద్ద ప్యాచ్ వర్క్ చేయడానికి, ముళ్లపొదలు తొలగించే పనుల నిమిత్తం ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే గుంతలు పూడ్చడంతోపాటు ముళ్ల పొదలు తొలగిస్తాం.

– భార్గవ్, ఏఈ, ఆర్‌అండ్‌బీ

రైతుబీమా చెక్కు అందజేత



రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: గట్టు మండలం రాయాపురం గ్రామానికి చెందిన రైతు మారెప్ప ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి భార్య సువార్తమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5లక్షల రైతు బీమా చెక్కును శుక్రవారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అందజేశారు. సర్పంచ్ ప్రవీణ్, ఎంపీటీసీ రంగస్వామి, పార్టీ నాయకులు రాముడు, గోవిందు, సిద్దూ పాల్గొన్నారు.

వెటర్నరీ డాక్టర్‌ను నియమించాలి

మల్దకల్: మండలంలోని పాల్వాయి పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించాలని రైతులు కోరుతున్నారు. డాక్టర్ లేకపోవడంతో రూ.40లక్షలతో నిర్మించిన నూతన భవనం నిరుపయోగంగా మారిందని తెలిపారు. పశువులు, గొర్రెలు అనారోగ్యం బారిన పడితే అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి పశువైద్య కేంద్రానికి డాక్టర్‌ను నియమించాలని కోరారు.



నిరుపయోగంగా మారిన పశువైద్య కేంద్రం భవనం

అభివృద్ధి పనుల పరిశీలన

మానవపాడు: మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఎంపీడీఓ రమణారావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

12నుంచి కబడ్డీ పోటీలు

శాంతినగర్: కార్తీక దామోదరుడి మహోత్సవాల్లో భాగంగా వడ్డేపల్లి మండలం తిమ్మాజిపల్లిలో ఈనెల 12నుంచి 13వరకు ఓపెన్ కబడ్డీ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. టోర్నీలో పాల్గొనే క్రీడాకారులు ఎంట్రీ ఫీజు రూ.500 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ కనబర్చే జట్లకు మొదటి బహుమతి రూ.30వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.15వేలు, నాల్గో బహుమతి రూ.10వేలు, ఐదో బహుమతి రూ.5వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అదేవిధంగా గ్రామస్తులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులకు భోజన సౌకర్యం ఉంటుందని, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తెగుళ్ల బెడద.. తగ్గిన దిగుబడి

- ఆందోళనలో రైతులు
- 4668 ఎకరాలలో మామిడి తోటలు

వీపనగండ్ల: మండలంలోని పలు గ్రామాలలో మామిడి తోటలను సాగుచేస్తున్న రైతులు పంటల దిగుబడి సరిగా రాక నష్టపోతున్నారు. మండలంలో అత్యధికంగా రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. మూడేళ్లుగా కనీస పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాదైన ముందస్తు రైతు అవగాహన సదస్సులు నిర్వహించి అధిక దిగుబడులు వచ్చేలా చూడాలని పలువురు రైతులు ఉద్యానవన శాఖ అధికారులకు విన్నవిస్తున్నారు.

4,668 ఎకరాలలో సాగు..

మండలంలో 4,668 ఎకరాలలో రైతులు మామిడి తోటలను సాగు చేస్తున్నారు. అందులో బొల్లారంలో 435, కొర్లకుంటలో 191, వల్లాభాపురంలో 66, గోపల్‌దిన్నెలో 384, కల్వరాల్లలో 345, గోవర్ధనగిరిలో 867, పుల్గర్‌చర్లలో 196, సంగినేనిపల్లిలో 381, సంపత్‌రావుపల్లిలో 175, తూముకుంటలో 441, వీపనగండ్లలో 1,207 ఎకరాలలో రైతులు మామిడి పంటలను సాగు చేస్తున్నారు. దీంతోపాటు మరో 1,500 ఎకరాలలో చిన్నదశలో ఉన్న మామిడి మొక్కలను పెంచుతున్నారు.

ఏటా నష్టాలలో..

మూడేళ్లుగా మామిడి తోటలకు తామర తెగులు సోకడంతో ఎకరాకు 30 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా కనీసం 10 టన్నుల దిగుబడి కూడా రాలేదు. వచ్చిన కొద్దిపాటి దిగుబడిని అమ్ముకునేందుకు సమీపంలో మామిడి మార్కెట్‌లను ఏర్పాటు చేయకపోవడంతో జడ్చర్ల, హైదరాబాద్ పట్టణానికి మామిడికాయలను తీసుకెళ్లిన రైతులు దళారుల బారినపడి అధిక మొత్తంలో నష్టపోయారు. ఉన్నతాధికారులు చొరవ చూపి మామిడి మార్కెట్ తోపాటు అవగాహన సదస్సును నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.



వీపనగండ్లలో మామిడితోట

కౌలు డబ్బులు రాలేదు



మామిడి తోటలను లీజుకు తీసుకొని రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టగా వచ్చిన దిగుబడిని విక్రయించగా కనీస కౌలు డబ్బులు కూడా రాలేదు. కొల్లాపూర్‌లో మామిడి విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ఎన్నో ఏళ్లుగా చెబుతున్నా కార్యరూపం దాల్చడం లేదు.

– రాజు, రైతు సంగినేపల్లి

సమష్టి చర్యలతోనే అధిక లాభాలు



మామిడి రైతులు సమష్టి నివారణ చర్యలు తీసుకోవడం వల్లే అధిక దిగుబడులను పొందవచ్చు. సరైన సమయంలో సస్య రక్షణ చర్యలు తీసుకుంటే తెగుళ్ల బారి నుంచి మామిడి తోటలను కాపాడుకోవచ్చు. అవగాహన సదస్సుల ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు తెలియజేస్తాం.

– కృష్ణ, ఉద్యానవనశాఖ అధికారి, వీపనగండ్ల

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

అయిజ: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ ఆఫీసర్ రాములు అన్నారు. మండలంలోని మేడికొండలో శుక్రవారం గణిత కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులకు అర్థవంతమయ్యేలా విద్యాబోధన సాగించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు. అనంతరం పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయుడు కర్రెప్ప, అసిస్టెంట్ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నోడల్ ఆఫీసర్ రాములు

రేపు కార్తీక వన భోజనాలు



ఆహ్వాన పత్రం అందజేస్తున్న సేవాసమితి సభ్యులు

శాంతినగర్: కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం గద్వాల సమీపంలోని నది అగ్రహారం వద్ద కార్తీక వన భోజనాల కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా రెడ్డి సేవాసమితి సభ్యులు తెలిపారు. శుక్రవారం వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో పలువురికి ఆహ్వాన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు వనభోజన కార్యక్రమం ఉంటుందని, భారీగా తరలివచ్చి కార్తీక దామోదరుడి ఆశీస్సులు పొందాలని కోరారు.

విద్యాబోధనలో మెళకువలు పాటించాలి

మానవపాడు: విద్యార్థులకు విద్యాబోధనలో మెళకువలు పాటించాలని ఎంఈఓ శివప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్‌స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 6నుంచి 10వ తరగతి వరకు ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

అలంపూర్ రూరల్: పట్టణంలోని అలెక్జర్ కాలనీలో శుక్రవారం గురుస్వామి గణేష్ ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజా మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు లక్ష్మీనారాయణ, ఎల్లయ్య, రఘు, కృష్ణ, రాము, నవీన్, శ్యామ్, రంగ, విజయ్, శ్రీనివాసులు, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి కాంస్య పతకం



సాయికావ్యను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు

అయిజ: ఉత్తరాఖండ్‌లోని దెహరాడూన్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పట్టణంలోని లయోలా పాఠశాల విద్యార్థిని సాయికావ్య ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించింది. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థిని సాయికావ్యను తైక్వాండో కోచ్ సుధీర్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ సన్నీ, పీఈటీ క్రాంతి అభినందించారు.

గుంతల రోడ్డుతో అవస్థలు



గుంతలమయంగా మారిన ఉండవెల్లి-కంచుపాడు రోడ్డు

ఉండవెల్లి: మండల కేంద్రం నుంచి కంచుపాడుకు వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు మొత్తం దెబ్బతినడంతో రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

గ్రంథాలయ నిర్వహణపై నిర్లక్ష్యం

- ఏటేటా మెయింటెనెన్స్ చెల్లింపు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



పట్టణంలో మూతపడిన గ్రంథాలయం

అమరచింత: పట్టణంలో కొన్నేళ్లుగా గ్రంథాలయం మూతపడిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో వాటిలోని పుస్తకాలు, గ్రంథాలు చదులు పట్టిపోతున్నాయి. మండలంగా ఏర్పాటు కాకముందే పట్టణంలోని శాఖ గంథ్రాలయాన్ని నిర్వహిస్తు పాఠకులకు దినపత్రికలతో పాటు కథల పుస్తకాలు, వివిధ రకాల నవలలు అందుబాటులో ఉంచేవారు. మండలం ఏర్పడినప్పటి నుంచి గ్రంథాలయ నిర్వహణపై జిల్లా గ్రంథాలయ శాఖ దృష్టి సారించకపోవడంతో ఇప్పటికి మూసిన తలుపులు మూసినట్టుగానే ఉన్నాయి. పట్టణంలోని కొంతమంది యువకులు, ఉపాధ్యాయులు, వివిధ రాజకీయ పార్టీ నాయకుల సహకారంతో గ్రంథాలయ ఆవశ్యకతను గుర్తించి చందాలతో కొన్ని ఏళ్ల గ్రంథాలయాన్ని కొనసాగించారు. మాజీ అడ్వకేట్ జనరల్, డీఎంఆర్‌ఎం ట్రస్ట్ చైర్మన్ దేశాయి ప్రకాష్‌రెడ్డి భవన అద్దెతో పాటు నిర్వాహకుడికి వేతనం అందిస్తూ వచ్చారు. కొంత కాలానికి భారం అధికమవ్వడంతో వెనకడుగు వేశారు. దీంతో నాలుగేళ్లుగా పట్టణంలో గ్రంథాలయం మూతపడింది. మున్సిపాలిటీ వచ్చిన తర్వాతనైన గ్రంథాలయానికి మహర్దశ వస్తుందని ఆశపడిన పాఠకులకు నిరాశే మిగిలింది.

మూడేళ్లుగా మెయింటెనెన్స్ చెల్లింపు

మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత అధికారుల ఆదేశాల ప్రకారం పట్టణంలో గ్రంథాలయ నిర్వహణ కోసం ప్రతి సంవత్సరం ఇంటి పన్నుల వసూళ్లలో 7శాతం వాటాను జిల్లా గ్రంథాలయ సంస్థకు పంపుతున్నారు. మొదటి సంవత్సరం రూ.15వేలు, రెండో సంవత్సరం రూ.45వేలు, మూడవ సంవత్సరం రూ.92 వేలు మున్సిపాలిటీ ద్వారా చెల్లించారు. ప్రస్తుత సంవత్సరం రూ.2.30 లక్షలు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. మున్సిపాలిటీ ద్వారా మెయింటెనెన్స్ అందుకుంటున్న జిల్లా గ్రంథాలయ శాఖ మాత్రం దినపత్రికలను సైతం అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయలేకపోతుంది.